'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# అజరామర కీర్తి.. అస్తిత్వ దీప్తి..



నూర శ్రీనివాస్

**ఢిల్లీ గద్దెపై తెలంగాణ అస్తిత్వ పతాక ఆకాశమంత ఎత్తుకు సగర్వంగా ఎగిరిన అపూర్వ సందర్భం. తెలంగాణ తల్లీ తన గడ్డకు వస్తున్నానని ప్రకటించుకున్న సన్నివేశం. ఉద్యమ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 11 రోజుల అకుంఠిత ఆమరణ దీక్షకు ఢిల్లీ తలొగ్గిన శుభతరుణం. స్వరాష్ట్ర కాంక్షను నెరవేరుస్తామని ఢిల్లీ ప్రకటించిన సుదినం. అదే 2009, డిసెంబర్ 9.**



తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో సువర్ణాక్షరాలతో లిఖించిన అపూర్వ సందర్భం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సాఫల్య సాకార ప్రక్రియకు శ్రీకారం చుట్టిన శుభదినం. 2009 నవంబర్ 29న నాటి ఉద్యమనేత, బీఆర్ఎస్ పార్టీ అధినేత కే.చంద్రశేఖర్ రావు ఆమరణ దీక్ష ప్రారంభించిన మొదలు 11 రోజుల పాటు నలుదిక్కులను ఏకంచేసి కేంద్రం తెలంగాణ ఏర్పాటు చేయక తప్పని అనివార్యతను సృష్టించిన అజరామర ఘట్టం. కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్షకు తలొగ్గిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ప్రకటన చేసి నేటికి సరిగ్గా పద్నాలుగేండ్లు. ఈ సందర్భంగా ఆనాటి కేసీఆర్ అకుంఠిత దీక్షను మరోసారి మననం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమై హైదరాబాద్ నుంచి నవంబర్ 28న కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని ఉత్తర తెలంగాణభవన్‌కు చేరుకున్నారు. అప్పటికే 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.... తెలంగాణ జైత్రయాత్రో.. కేసీఆర్ శవయాత్రో' అని కేసీఆర్ నినదించి ఉండటంతో తెలంగాణవ్యాప్తంగా ఉద్విగ్న, ఉత్కంఠభరిత వాతావరణం నెలకొన్నది. కేసీఆర్ దీక్షను అడ్డుకోవడానికి కరీంనగర్ వ్యాప్తంగా 144 సెక్షన్ విధించడం, తెలంగాణ భవన్ వద్ద భారీగా పోలీసులు, ఇంటెలిజెన్స్ వర్గాలు చేరడంతో కరీంనగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేసీఆర్ ఆమరణ దీక్ష చేపడుతారా, పోలీసులు అడ్డుకుంటారా అనే ఉత్కంఠ వాతావరణం తెలంగాణ వ్యాప్తంగా ఆవహించింది.

నవంబర్ 28వ తేదీ అర్ధరాత్రి కరీంనగర్‌లో క్షణక్షణం ఉత్కంఠ, ఉద్విగ్నం. ఉత్కంఠ.. ఉద్వేగం కలగలిసిన వాతావరణం. దీక్షను అడ్డుకొని తీరుతామన్న ప్రభుత్వం పట్టు ఓ వైపు.. దీక్ష చేసి తీరుతానన్న కేసీఆర్ పట్టుదల మరోవైపు. కేసీఆర్ బస చేసిన ఉత్తర తెలంగాణ భవనం చుట్టూ అంచెలవారీగా పోలీసుల మోహరింపు. తెలంగాణ భవనాన్ని పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. అంతే ధీటుగా ప్రజలు, కార్యకర్తలు పోలీసుల ప్రయత్నాలను తిప్పికొట్టడానికి సంసిద్ధమయ్యారు. తెలంగాణ భవన్ రాత్రంతా 'ధూం ధాం..'. పది జిల్లాల తెలంగాణ రణ నినాదమై ఎగిసిపడుతున్నది. క్షణమొక యుగంలా తెలంగాణ అంతా తెల్లవారింది. నవంబర్ 29న ఉదయం తెలంగాణ భవన్‌లోనే కేసీఆర్ మీడియా సమావేశంలో ప్రభుత్వ దమనకాండను ఎండగట్టారు. ఉత్తర తెలంగాణ భవన్ నుంచి దీక్షకు సిద్ధమయ్యారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, మాజీ మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, జీవీఆర్, రాజయ్య యాదవ్‌తో కలిసి సిద్దిపేట దీక్షాస్థలికి వాహనంలో బయల్దేరారు.

> **తెలంగాణ భవన్ వద్ద వేలాది మంది ప్రజలు, కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున మోహరించటం.. అక్కడేం చేసినా తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యే అవకాశం ఉందని గ్రహించిన పోలీసులు తమ వ్యూహాన్ని కరీంనగర్ పొలిమేరలకు మార్చుకున్నారని ఆ తర్వాత అల్గునూర్‌లో జరిగిన పరిణామ క్రమంతో తేలిపోయింది.**

కేసీఆర్ కాన్వాయ్ బయల్దేరగానే, కార్తకర్తలు, మీడియా వాహనాలు కాన్వాయ్‌ను అనుసరించకుండా అల్గునూర్ బ్రిడ్జి వద్ద నిలిపివేశారు. అత్యంత నాటకీయ పరిణామాల మధ్య అల్గునూరు చౌరస్తా వద్ద కేసీఆర్ వాహనాన్ని అడ్డుకొని ఆయనను అదుపులోకి తీసుకున్నారు. కేసీఆర్‌ను అదుపులోకి తీసుకున్నది సాధారణ పోలీసులు కాదు. దేశ సరిహద్దుల్లో విదేశీ శక్తులు లేదా దేశ ద్రోహులతో తలపడేందుకు వినియోగించే ప్రత్యేక పోలీసు బలగం ఆక్టోపస్‌ను నాటి ప్రభుత్వం కేసీఆర్‌ను కట్టడి చేసేందుకు రంగంలోకి దింపింది.


అల్గునూర్ చౌరస్తా నుంచి కేసీఆర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు వరంగల్ వైపు తరలించారు. వరంగల్ కోర్టులో ప్రవేశపెడుతారని, అక్కడినుంచి వరంగల్ సెంట్రల్ జైలుకు తరలిస్తారని అటు కోర్టు దగ్గర, ఇటు జైలు దగ్గర భారీ ఎత్తున ప్రజలు, తెలంగాణవాదులు, వివిధ పార్టీల శ్రేణులు చేరుకున్నారు. విషయం తెలిసిన వెంటనే వరంగల్‌లో అగ్గిరాజుకుంది. కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు కేసీఆర్‌ను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకుంటారని సమాచారం అందుకున్న పోలీసులు 'ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట మీదుగా హైదరాబాద్ తరలిస్తారు' అని పక్కదారి పట్టించారు. నిజమే కావచ్చని విద్యార్థులు విశ్వవిద్యాలయ ప్రాంగణంలోకి వెళ్లారు. అంతే వాయువేగంతో పోలీస్ వాహనశ్రేణి వరంగల్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ హంటర్‌రోడ్ మీదుగా నాయుడు పంప్.. మామునూర్ మీదుగా తొర్రూర్ వైపు వాహనాలు అక్కడా తిరుమలగిరి నుంచి హైదరాబాద్ తరలిస్తారని వదంతులు. కానీ తొర్రూర్ మీదుగా నేరుగా ఖమ్మం తరలించారు. 'కేసీఆర్‌ను పోలీసులు ఖమ్మం కోర్టులో హాజరుపరిచారు' అనే దాకా తెలంగాణ అంతటా ఏం జరుగుతుందో తెలియని గందరగోళం, అయోమయం, ఆందోళన.

> **ఖమ్మం కోర్టు కేసీఆర్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో కేసీఆర్ తన ఆమరణ దీక్షను విరమించే ప్రసక్తే లేదని ప్రకటించి జైల్లోనే దీక్షను కొనసాగించారు. ఆ తర్వాత నాటకీయ పరిణామాల నడుమ ఖమ్మం ఆస్పత్రికి.. అక్కడినుంచి నిమ్స్‌కు తరలించేదాకా క్షణమొక యుగం.. ఘడియొక గండంలా తెలంగాణ తయారైంది. కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తోందన్న సమాచారంతో తెలంగాణలో అగ్గి రాజుకుంది.**

ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థుల ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. పోలీసులు రబ్బరు బుల్లెట్లు వదిలినా.. బాష్పవాయు గోళాలు పేల్చినా విద్యార్థులు వెనకంజ వేయలేదు. ఉద్యమకారులందరి రక్తం వేడెక్కింది. బస్సులు, రైళ్ల రాకపోకలు స్తంభించాయి. పరిస్థితి చేయి దాటుతుండటంతో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి రోశయ్య అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేశారు. సీపీఎం మినహా అన్నిపార్టీలు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించాయి. ఇదే విషయం స్పష్టం చేస్తూ ఢిల్లీకి నివేదిక కూడా ఇచ్చాయి. పర్యవసానాలు వేటికవే పోటాపోటీగా కొనసాగాయి. కేసీఆర్ దీక్ష ప్రారంభించిన 11 రోజులకు, సరిగ్గా 2009 డిసెంబర్ 9న కేంద్రం దిగివచ్చింది. అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం ప్రత్యేక రాష్ట్ర ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు అర్ధరాత్రి అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో యావత్ తెలంగాణ పులకించిపోయింది. ఆందోళన స్థానంలో హర్షాతిరేకాలు చేరాయి. ధర్నాలు, నిరసనల స్థానంలో సంబురాలు, విజయోత్సవాలు.

జై తెలంగాణ..!

# ఎటమటం





## బాబోయ్ ఉచిత బస్సులు..

'సీత కష్టాలు సీతవి, పీత కష్టాలు పీతవి..' అనే నానుడి ఇక నుంచి 'ఉచిత బస్సు కష్టాలు ఉచిత బస్సువి..' అని వినాల్సి వస్తుందేమో. కర్ణాటకలో ఇప్పటికే ఈ పథకం అమల్లోకి వచ్చాక అక్కడ ఉత్పన్నమైన సమస్యలు ఇకముందు ఇక్కడా చవిచూడక తప్పదు. ఈ సౌకర్యం వచ్చాక కర్ణాటకలో ఇంటి పని మనుషుల, వ్యవసాయ, భవన నిర్మాణ రంగంలో మహిళా కార్మికుల కొరత తలెత్తినట్టు అక్కడ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. దేవాలయాలు కిక్కిరిసిపోవడంతో ఉచిత అన్నదాన కార్యక్రమాలు బందయ్యాయి. చిన్నచిన్న గొడవలకే భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోవడం వంటి సామాజిక సమస్యలు తలెత్తాయి. ఆ ఉచిత బస్సు కల్పించినంత మాత్రానా ఖర్చులకు డబ్బులుండొద్దా? అనే అనుమానాలేమీ వద్దు. ఇదే మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు నెలకు రెండున్నర వేలు కూడా చెల్లిస్తారు. మహిళలకే అన్నిస్తే మేమేం పాపం చేశాం, వారికిచ్చే రాయితీలు తమకు కూడా ఇవ్వాలని కర్ణాటకలో మాజీ ఎమ్మెల్యే నాగరాజు అనే పెద్దమనిషి ఉద్యమం లేవదేశారు. మహాలక్ష్మి తరహాలో పురుషులకు కూడా నారాయణ పేరుతో ఉచిత బస్సు, పింఛన్ ఇవ్వాలని బస్సుల్లో టికెట్ తీసుకోకుండా ఆందోళనలు చేస్తున్నారు.




## మరక మంచిదే!

మరక కూడా ఒక్కందుకు మంచిదే అంటారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ప్రమాణ స్వీకారానికి హైదరాబాద్ వచ్చిన కర్ణాటక సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. వారు అతికష్టం మీద కాలినడకన ఎల్‌బీ స్టేడియం వేదిక వద్దకు చేరుకోవాల్సి వచ్చింది. ఇది ప్రసార మాధ్యమాల్లో రావడంతో, అక్కడ కర్ణాటకలో ఇది ఒక్కందుకు తమ మంచికే జరిగిందని టెక్కీలు సంతోషించినట్టు సమాచారం. బెంగళూర్‌లో నిత్యం తాము ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యపై అరిచి గీపెట్టినా తమ ప్రభుత్వం చెవికెక్కడం లేదు. కనీసం వారికి హైదరాబాద్‌లో ఎదురైన సమస్యతోనైనా తమ పరిస్థితి అర్థం చేసుకుంటారని ఖుషీ అయితుండ్రు.



## మిస్డ్ కాల్ ఇస్తే వస్తడా?

ఏ మాటకు ఆ మాట చెప్పాలంటే, మాట మార్చడంలో కోమటిరెడ్డి బ్రదర్స్ సిద్ధహస్తులు. ఎన్నికల ప్రచార సభలో 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నేనే సీఎం అవుతా'నని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. 'ఒకవేళ కాకున్నా, సీఎంగా ఎవరున్నా ఒక్క మిస్డ్ కాల్ ఇస్తే, హెలికాప్టర్ వేసుకొని క్షణాల్లో ఎక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చేస్తాడ'న్నారు. కాంగ్రెస్ సర్కార్ అయితే వచ్చింది కానీ, కోమటిరెడ్డి సీఎం కాలేకపోయారు. మంత్రివర్గంలో స్థానం అయితే దొరికింది కానీ, పాత పగ మనసులో పెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డి తన మాట వింటాడో లేదో అన్న భయం పట్టుకున్నట్టున్నది. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే తనకు సీఎం కావాలన్న ఆలోచన కానీ, రేవంత్‌రెడ్డితో విభేదాలు గానీ ఎప్పుడూ లేవని గుర్తుచేశారు. ఇంతకు మిస్డ్ కాల్ ఇస్తే సీఎం వస్తాడో... రాడో మాత్రం చెప్పలేక పోయారు.



## బేగానా షాదీమే అబ్దుల్లా దీవానా

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రమాణ స్వీకారానికి పొరుగు రాష్ట్ర సీఎం జగన్‌కు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తదితరులందరికీ ఆహ్వానం అందింది, కానీ వైఎస్ఆర్‌టీపీ అధినేత్రి షర్మిలకు, ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్.. ఈ ఇద్దరికి మాత్రమే అందలేదు. ఇది మరీ అన్యాయం, తాను కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం వల్లనే కాంగ్రెస్ గెలిచిందని ఆమె అంటున్నారు కదా? కేఏ పాల్ ఏమో తాను రాహుల్‌గాంధీకి ఫోన్ చేసి రేవంత్‌రెడ్డికి సీఎం పదవి ఇవ్వాలని చెప్పాకే పోస్టు ఖరారైందని అన్నారు కదా? అవును, వారు అలా అన్నారనే పిలువలేదు. వాస్తవానికి మొదట పిలుద్దామనే అనుకున్నామని ఆహ్వాన కమిటీ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు.

**- వెల్జాల**

## రైలు ప్రయాణం మెరుగుపడేదెప్పుడు?

**భారతీయ ఆర్థికవ్యవస్థకు రైల్వే విభాగం జీవనాడి వంటిది. ఏటా రైలు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ దానికి తగ్గట్టుగా మౌలిక సదుపాయాల కల్పన పెరగటం లేదు. ప్రతి రోజూ లక్షలాది మంది ప్రయాణికులు తమ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. మెట్రో నగరాల్లో రైల్వే బ్రిడ్జిలు రద్దీగా ఉండి ప్లాట్‌ఫాం మొదలు నుంచి చివరి వరకు చేరుకునేందుకు కనీసం 15 నిమిషాలు పడుతున్నది. రద్దీ సమయాల్లో లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేయక పోవడం నిత్యకృత్యం.**

సామాన్య ప్రజలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దుచేయడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ రిజర్వ్‌డ్ బోగీల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల స్లీపర్ క్లోచ్‌లలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బోగీలలో కెపాసిటీకి మించిన ప్రయాణికులు ఉండటం వలన టాయిలెట్ ఉపయోగం ఎక్కువ. మూత్రశాలల్లో నీరు లేకపోవడం, భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నదని ప్రయాణికులు వాపోతుండటం గమనార్హం. బోగీల్లో అపరిశుభ్రత ప్రయాణికుల ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నది. ఒకే రైలును పేరు మార్చి వివిధ రూట్లలో తిప్పడం వల్ల బోగీలను, టాయ్ లెట్లను శుభ్రపరచడం, బెర్తులు, సీట్లు, చెడిపోయిన నల్లాలు, పైపుల మరమ్మతు చేసే సమయం కూడా ఉండటం లేదని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు.

ఒక్కోసారి ఎటువంటి ముందస్తు సూచనలు తెలపకుండా ప్యాసింజర్ రైళ్లు రద్దుచేయడం లేదా ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యం తగ్గించడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ వారంలో మిగ్‌జాం తుఫాన్ వల్ల రైళ్లు రద్దుచేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రద్దుచేయడం మంచిదే, కానీ, తుపాన్ ప్రభావం లేని ఖాజీపేట, విజయవాడ జంక్షన్ల మధ్య ప్రతిరోజు నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా కేంద్రంలోని పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వారు కేవలం హామీలు, గ్యారంటీలకు పరిమితమయ్యారు.

రైల్వేలు ప్రజల సొమ్ముతో నిర్మించినవి. అందుబాటు ధరల్లో సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రజల వద్ద వసూలు చేసిన పన్నులు ద్వారా వచ్చిన సొమ్ముతో ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరచాలి. వయో వృద్ధులకు గతంలో ఇచ్చిన రాయతీలు పునరుద్ధరించాలి. కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో చంద్రయాన్‌కు రాకెట్ పంపినప్పుడు అంతకన్నా తక్కువ ఖర్చుతో రైళ్ల సంఖ్య పెంచి స్టేషన్లలో మౌలిక సదుపాయాలు, నూతన ప్యాసింజర్ రైళ్లు, బోగీల సంఖ్య పెంచవచ్చు. సుఖవంతమైన, ఎటువంటి అసౌకర్యం లేకుండా పరిశుభ్రమైన రైలు ప్రయాణం చేసినప్పుడే 'స్వచ్ఛ రైల్- స్వచ్ఛ భారత్' నినాదానికి సార్థకత ఏర్పడుతుంది. ఈ దిశగా రైల్వే అధికారులు దృష్టి సారించాలి.

**- ఆళవందార్ వేణుమాధవ్**

# గెలుపు సరే.. సీఎంల ఎంపిక మాటేమిటి?

**రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో బీజేపీ గెలుపు తీరాలకు చేరి ఆరు రోజులు గడిచాయి. ఆయా రాష్ట్రాలతో పాటు ఎన్నికలు జరిగిన తెలంగాణ, మిజోరంలో ఇప్పటికే ప్రభుత్వాలు కొలువుదీరాయి. కానీ బీజేపీ చేజిక్కించుకున్న మూడు రాష్ట్రాల్లో ఇప్పటికీ సీఎం ఎంపిక ఓ కొలిక్కి రాలేదు. ఎన్నికల్లో గెలిచినంత సులువుగా ముఖ్యమంత్రుల ఎంపిక ఉండదని తెలుసుకున్న బీజేపీ అధినాయకత్వం మల్లగుల్లాలు పడుతున్నది. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి షా ద్వయం తలలు పట్టుకుంటున్నది.**

మూడు రాష్ట్రాల్లో పోటీ తీవ్రంగా ఉండటంతో కేంద్ర నాయకత్వానికి ఏం చేయాలో పాలుపోవడం లేదు. రానున్న నాలుగైదు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాల సీఎం ఎంపిక కత్తి మీద సాములా మారింది. కుల, ప్రాంత, వర్గ సమీకరణాలను బేరీజు వేసి ఎంపిక చేయాల్సి ఉండటంతో కేంద్ర నాయకత్వం ఆచితూచి అడుగులు వేస్తున్నది. మరోవైపు ఎన్నికల వేళ మూడు రాష్ట్రాల్లోనూ సీఎం అభ్యర్థులను బీజేపీ ముందుగానే ప్రకటించలేదు. అన్నిచోట్ల ప్రధాని మోదీ అన్నీ తానై ప్రచారాన్ని నడిపించారు. దీంతో స్థానిక నాయకత్వంపై కొంతమేరకు ఉన్న అసంతృప్తి, వ్యతిరేకత మరుగున పడిపోయింది. అయితే ప్రచారం చేసినంత మాత్రాన ప్రధాని మోదీ, అన్ని రాష్ట్రాల్లోనూ ముఖ్యమంత్రిగా పాలన చేయలేరు కదా. అందుకే ప్రస్తుతం సీఎంలను ఎంపిక చేయక తప్పని పరిస్థితి. మరోవైపు ఆయా రాష్ట్రాల్లో సీనియర్, జూనియర్ పంచాయితీ కూడా నడుస్తున్నది. అన్ని రాష్ట్రాల్లోనూ ఇద్దరికీ మించి పోటీలో ఉండటం తలనొప్పిగా మారింది. అదే సమయంలో స్థానిక నాయకత్వంపై వ్యతిరేకతను తగ్గించేందుకు కొంతమంది కేంద్రమంత్రులు, ఎంపీలు కూడా అసెంబ్లీ బరిలో నిలిచారు. వారిలో దాదాపు అందరూ విజయం సాధించారు. దీంతో ఆయా రాష్ట్రాల్లో కేంద్రమంత్రులు, ఎంపీలు కూడా సీఎం పదవి కోసం పోటీ పడుతున్నారు.

మరోవైపు స్థానిక నేతలు రాష్ట్రాలపై పట్టు నిలుపుకోకుండా మోదీ, షా ద్వయం ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పడుతున్నది. రాష్ట్రాలపై తమ పట్టు సడలకుండా వారు వ్యూహాలు రచిస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎవరో ఒకరు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా ఉండటం వారికి ఇష్టం లేనట్టు తెలుస్తున్నది. కర్ణాటకలో వయోభారంతో బాధపడుతున్న మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పపై అతిగా ఆధారపడిన బీజేపీ అక్కడ చతికిలపడింది. ఆయన్ను సీఎం పదవి నుంచి తొలగించిన తర్వాత అక్కడ బీజేపీ కోలుకోలేకపోయింది. ఆర్నెళ్ల కిందట జరిగిన కర్ణాటక ఎన్నికల్లో ఆ పార్టీ చావుదెబ్బతిన్నది. ఆరు నెలల వరకు అక్కడ వర్గపోరు కారణంగా ప్రతిపక్ష నేతను కూడా నియమించకపోవడం గమనార్హం. బీజేపీ సంస్థాగత కార్యదర్శి బీఎల్ సంతోష్, మాజీ సీఎం యడియూరప్ప మధ్య ఆధిపత్య పోరు కారణంగానే ఈ ఆలస్యం జరిగింది. వారిని కాదని ప్రధాని మోదీ ఏమీ చేయలేని పరిస్థితి తలెత్తింది. అందుకే మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజేలను ఓ ప్రణాళిక ప్రకారం తప్పించే ప్రయత్నం జరుగుతున్నట్టు తెలుస్తున్నది. ఆయా రాష్ట్రాల్లో వారే ప్రధాన నేతలుగా ఎదిగితే భవిష్యత్తులో పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉందని బీజేపీ అధిష్ఠానం భావిస్తున్నది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యువత ఓట్లను టార్గెట్ చేసిన బీజేపీ యువ నేతలను తెరపైకి తీసుకురావాలని భావిస్తున్నది! ఈ కారణంగానే ఆయా రాష్ట్రాల్లో శివరాజ్ సింగ్ చౌహాన్, వసుంధర రాజేలను సీఎం అభ్యర్థులుగా ప్రకటించలేదని అంటున్నారు.

రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సరైన అభ్యర్థులను ఎంపిక చేసే బాధ్యతను కేంద్ర బీజేపీ నాయకత్వం పరిశీలకుల చేతిలో పెట్టింది. తాజాగా మూడు రాష్ట్రాలకు పరిశీలకులను నియమించింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్, వినోద్ తావాడే, సరోజ్ పాండే రాజస్థాన్‌కు, హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్, కె.లక్ష్మణ్, ఆశా లక్రా మధ్యప్రదేశ్‌కు, కేంద్ర మంత్రి అర్జున్‌ముండా, శర్బానంద్ సోనోవాల్, దుశ్యంత్ గౌతమ్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి పరిశీలకులుగా నియమితులయ్యారు.



వీరు ఆయా రాష్ట్రాల్లో ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలతో భేటీ అయ్యి వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ఆయా రాష్ట్రాల్లో వివిధ సమీకరణాలపై చర్చిస్తున్న పరిశీలకులు కేంద్ర నాయకత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నారు. ఆశావహులతో సమావేశమవుతున్నారు.

> **బీజేపీ అంటేనే కేంద్ర నాయకత్వం కనుసన్నల్లోనే ఎంపికలుంటాయని అందరికీ తెలిసిందే. అయితే మారుతున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా బీజేపీ అధిష్ఠానం సైతం వేచిచూసే ధోరణిని అవలంబిస్తున్నది. బీజేపీ అంటే క్రమశిక్షణ.. క్రమశిక్షణ అంటేనే బీజేపీ అని ఆ పార్టీ నేతలు చెప్పుకొంటున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. గతంలో కాంగ్రెస్ పార్టీలో మాత్రమే కనిపించే వర్గ, ఆధిపత్య పోరు, గ్రూపు రాజకీయాలు బీజేపీలోనూ ఇప్పుడు కనిపిస్తున్నాయి.**

ఆ కారణంగానే సీఎంల ఎంపిక ఆలస్యమవుతున్నదనేది జగమెరిగిన సత్యం. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ నేతల మధ్య సీఎం కుర్చీలాటను చూసి ఎద్దేవా చేసిన బీజేపీ ఇప్పుడు అదే కుర్చీలాటలో మునిగిపోయింది. రెండు, మూడు రోజుల పాటు ఉత్కంఠ రేపిన తెలంగాణ సీఎం ఎంపిక ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చింది. దీంతో ఇప్పుడు ఆ పార్టీ నేతలు బీజేపీపై సెటైర్లు వేస్తున్నారు. 'ఎన్నికల ఫలితాలు వెలువడి 24 గంటలు గడవకముందే తెలంగాణ సీఎం ఎవరంటూ మీడియా, ప్రతిపక్షాలు కాంగ్రెస్‌ను ఎద్దేవా చేశాయి. మేం సీఎంను ప్రకటించేశాం. మరి మీ సీఎంలు ఎక్కడ? ఎందుకు ఆలస్యమవుతున్నది?' అంటూ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ట్విట్టర్‌లో బీజేపీని వెక్కిరించారు.

ఇక రాష్ట్రాల వారీగా చూస్తే మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్, రాజస్థాన్‌లో వసుంధర రాజే, ఛత్తీస్‌గఢ్‌లో రమణ్ సింగ్‌లు ఆయా రాష్ట్రాల్లో ప్రముఖంగా వినిపిస్తున్న పేర్లు. అయితే వారు కూడా తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో రమణ్‌సింగ్‌తో పాటు ఎంపీ రేణుకాసింగ్ కూడా పోటీలో ఉన్నారు. అసెంబ్లీకి ఎన్నికైన ఆమె తాజాగా ఎంపీ పదవికి రాజీనామా చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతోనూ సమావేశమవడం గమనార్హం. వీరిద్దరితో పాటు రాష్ట్ర బీజేపీ చీఫ్ విష్ణుదేవ్ సాయి కూడా సీఎం రేసులో ఉండటం పోటీని మరింత రసవత్తరంగా మార్చింది.

మధ్యప్రదేశ్‌లో ప్రస్తుత సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ముందంజలో ఉన్నట్టు కనిపిస్తున్నా.. ఆయన కూడా సహచరుల నుంచి పోటీ ఎదుర్కొంటున్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో ఆయన కేంద్ర నాయకత్వం దృష్టిని ఆకర్షించేందుకు ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచిన ఏకైక ఎంపీ స్థానమైన చింద్వాడాలో పర్యటించి లాడ్లీ యోజనపై ప్రచారం చేశారు. అయితే ఆయనకు పోటీగా ఉన్న మరో నేత విజయ్‌వర్గీయ శివరాజ్‌సింగ్‌పై పరోక్షంగా విమర్శలు చేశారు. లాడ్లీ యోజన పథకం వల్ల మధ్యప్రదేశ్‌లో విజయం దక్కలేదని.. ప్రధాని మోదీ చరిష్మా కారణంగానే మూడు రాష్ట్రాల్లోనూ గెలుపు తీరాలకు చేరామని చెబుతూ మోదీని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. వీరితో పాటు కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ పటేల్, జ్యోతిరాదిత్య సింధియా, నరేంద్రసింగ్ తోమర్ తదితరులు తమవంతు ప్రయత్నం చేస్తున్నారు.

రాజస్థాన్ విషయానికి వస్తే.. మాజీ సీఎం వసుంధర రాజే రిసార్టు రాజకీయాలకు తెరతీశారు. 25 మంది ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టిన ఆమె బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలవడం గమనార్హం. నడ్డాతో వసుంధర సమావేశాన్ని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సీపీ జోషి కొట్టిపడేశారు. ఆమె సమావేశం సాధారణమేనని అంటూ రాజే అభ్యర్థిత్వం ఇష్టం లేదని చెప్పకనే చెప్పారు. ఈ రాష్ట్రంలోనూ కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, రాజస్థాన్ యోగిగా పేరొందిన బాబా బాలక్‌నాథ్, దియా కుమారి నుంచి రాజే తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నారు. అయితే రిసార్టు రాజకీయాలకు తెరలేపిన వసుంధర రాజే రేసులో కాస్త ముందున్నట్టు తెలుస్తున్నది.

> **ఊహకందని నిర్ణయాలు తీసుకునే మోదీ, షా ద్వయం ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్‌ను సీఎం చేసినట్టుగానే అనూహ్యంగా కొత్త వారిని తెరపైకి తీసుకొచ్చినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు.**

**-ఎడిటోరియల్ డెస్క్**